క్లుప్తంగా

అధినేతతో ఆత్మీయ కలయిక



అధినేత వైఎస్ జగన్‌తో అదీప్‌రాజ్

పెందుర్తి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉత్తరాంధ్ర జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో కలిసి తనకు పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ సాక్షితో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో పార్టీ బలోపేతానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. పార్టీ యువజన విభాగం బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తామని పేర్కొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

రంగనాథన్ సేవలు చిరస్మరణీయం



రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రకళ

పెందుర్తి: గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ సేవలు చిరస్మరణీయమని గ్రంథాలయాధికారి బి.చంద్రకళ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రంగనాథన్ 133వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. రంగనాథన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి కుళాయిలు ప్రారంభం



కుళాయిలు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వసంత శంకర్రావు

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సమీపంలోని వీరనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జీవీఎంసీ మంచినీటి కుళాయిలను కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు చేతుల మీదుగా ప్రారంభించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు శానాపతి శంకర్రావు, ఏఈ రాజశేఖర్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మిత్రుడి జ్ఞాపకార్థం రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువత

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెంలో సింగంపల్లి సూర్యనారాయణ 8వ వర్ధంతి సందర్భంగా మిత్రులంతా కలిసి మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విశాఖలోని ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని మాజీ ఎంపీపీ గండి దేముడు శిబిరంలో 53 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సూర్యనారాయణ మిత్రులు అనిమిరెడ్డి అప్పలనాయుడు, గండి శ్రీను, బి.భాస్కరరావు, సింగంపల్లి నర్సింగరరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కల నెరవేరేనా?

'మా పాప ఇంటర్ మంచి మార్కులతో పాసైంది. డిగ్రీ చదివించాలంటే నగరానికి పంపాలి. అంత దూరం పంపడం అంటే మాకు ఇబ్బందిగా ఉంది. పోనీ దగ్గర్లోని ప్రైవేట్ కళాశాలలో చేర్పిద్దామంటే ఫీజులు అధికంగా చెల్లించాలి. అదే ఇక్కడ డిగ్రీ కళాశాల ఉంటే మా పాప ఇక్కడే చదువుకునేది. దీనిపై ప్రభుత్వం ఆలోచన చేయాలి' పెందుర్తి గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ తండ్రి ఆవేదనతో కూడిన డిమాండ్ ఇది. ఇతనే కాదు పెందుర్తిలో డిగ్రీ కళాశాల లేక ఎంతో మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు.

- దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నా అప్‌గ్రేడ్ కాని జూనియర్ కళాశాల
- పైచదువులకు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి
- ఈ ఏడాది తప్పనిసరిగా చేయిస్తామని చెబుతున్న ఎమ్మెల్యే

పెందుర్తి: మండలంలో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డిగ్రీ చదువులకు తిప్పలు పడాల్సి వస్తోంది. ఏళ్ల తరబడి డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తామన్న పెద్దల హామీలకు విలువ లేకుండా పోతోంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు నియోజకవర్గ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో డిగ్రీ కళాశాల హామీ ఒక్కటి. అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. అయితే ఈ దిశగా ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు సాగినట్లు కనిపించట్లేదు.

తప్పని ఎదురుచూపులు

పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల. ఈ పేరు వింటేనే ఘన చరిత్ర కళ్లముందు కదలాడుతుంది. ఎందరో పేరొందిన నేతలు, వ్యాపారవేత్తలు, క్రీడాకారులు చదువుకున్న విద్యా నిలయం ఇది. కానీ ఈ కళాశాల దశాబ్దాలుగా అప్‌గ్రేడ్‌కు నోచుకోక జూనియర్ కళాశాలగానే మిగిలిపోయింది. దీంతో పెందుర్తి పరిధిలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారు, ప్రధానంగా అమ్మాయిలు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. పాలకులు ఎప్పటికప్పుడు కళాశాలను డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తామని హామీలు గుప్పించడం తప్ప, ఆచరణకు నోచుకోవట్లేదని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.



కళాశాలలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సురక్షిత తాగునీటి సదుపాయం



జూనియర్ కళాశాల తరగతి గదిలో విద్యార్థులు



అప్‌గ్రేడ్‌కు నోచుకోని పెందుర్తి జూనియర్ కళాశాల

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మేలు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో భాగంగా రూ.1.79 కోట్ల నిధులు ఇక్కడి జూనియర్ కళాశాలకు కేటాయించారు. ఆయా నిధులతో గ్రీన్ చాక్ బోర్డులు, ఫర్నీచర్, విద్యార్థినులు, విద్యార్థులకు వేర్వేరుగా మరుగుదొడ్లు, కళాశాల మొత్తం విద్యుత్ సదుపాయంతో పాటు సురక్షిత మంచినీటి వసతి కల్పించారు. ఇప్పుడు కళాశాలను డిగ్రీకి అప్‌గ్రేడ్ చేస్తే సదుపాయాల కల్పనకు పెద్దగా నిధులు వెచ్చించాల్సిన పనిలేదు. ప్రభుత్వం స్పందించి డిగ్రీ కళాశాలను పెందుర్తిలో ఏర్పాటు చేస్తే వచ్చే విద్యా సంవత్సరం నుంచైనా ఇక్కడి విద్యార్థులకు వ్యయప్రయాసలు తగ్గుతాయి. పేదింటి పిల్లలు ఉన్నత విద్య అభ్యసించే అవకాశాలు మెరుగవుతాయని ప్రజలు కోరుతున్నారు.

చిత్తశుద్ధితో కృషిచేయాలి



2014 ఎన్నికల తర్వాత అప్పటి టీడీపీ ప్రభుత్వం జూనియర్ కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చింది. కనీస ప్రతిపాదన కూడా చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్‌గ్రేడ్ కోసం ప్రతిపాదనలు చేశాం. కోవిడ్, ఇతర సాంకేతిక కారణాలతో ఆలస్యమైంది. అయితే కళాశాల అభివృద్ధికి నాడు-నేడు పథకంలో రూ.1.79 కోట్లు కేటాయించి సౌకర్యాలు కల్పించాం. కూటమి ప్రభుత్వం అప్‌గ్రేడ్‌పై ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయాలి.
– బొడ్డపల్లి హేమంత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

ప్రతిపాదన చేశాం



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వానికి, సంబంధిత శాఖకు ప్రతిపాదనలు పంపించాను. దీనిపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి ఆమోదించుకుని వస్తాను. ఎట్టి పరిస్థితిలోనూ పెందుర్తిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తాను.
– పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్యే, పెందుర్తి

ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చేది లేదు

ఎమ్మెల్యే వద్ద బంగారమ్మపాలెం, ఎ.శిరసపల్లి రైతులు



ఎమ్మెల్యే పంచకర్లకు వినతిపత్రం అందిస్తున్న బంగారమ్మపాలెం, ఎ.శిరసపల్లి రైతులు

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెం శివారు ఎ.శిరసపల్లి రెవెన్యూ పరిధిలో ల్యాండ్ పూలింగ్ విధానంలో చేపడుతున్న ప్రభుత్వ భూసేకరణకు భూములిచ్చేది లేదని రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు పార్టీ కార్యాలయంలో ఎ.శిరసపల్లి రెవెన్యూ పరిధిలోని బంగారమ్మపాలెం, ఎ.శిరసపల్లి నుంచి అధిక సంఖ్యలో రైతులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారంతా తమ తాత, తండ్రుల నుంచి జీడి, మామిడి, కొబ్బరి వంటి తోటలను వేసుకుని భూములను సాగుచేస్తుండటంతో ఆయా భూములకు ప్రభుత్వం డీ పట్టాలు ఇచ్చిందన్నారు. వీటితో పాటు ఆయా భూముల్లో పశుపోషణ చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ నెల 7న తమకు ఏ విధమైన ముందస్తు సమాచారం లేకుండా గ్రామసభ నిర్వహించి భూ సేకరణ చేపడుతున్నట్లు చెప్పారన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాభీష్టం మేరకు రైతులకు తగు న్యాయం చేశాకే భూసేకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు వీఎంఆర్‌డీఏ కమిషనర్‌తో రైతుల సమక్షంలో మాట్లాడి గ్రామంలో తాత్కాలికంగా భూసేకరణ నిలుపుదల చేయాలని తెలిపారు. రైతులకు సరైన సమాచారం ఇవ్వకుండా భూ సేకరణ చేపట్టడం సరికాదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, దొడ్డి ప్రకాష్, ఉప సర్పంచ్ అంగటి సూరిబాబు, మాజీ సర్పంచ్ దాడి అప్పారావు, దార రాము ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: విద్యార్థులు మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు సూచించారు. ముత్యాలమ్మపాలెం జెడ్పీ హైస్కూల్లో మాదక ద్రవ్యాల వాడకం- అనర్థాలపై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సీఐ మల్లికార్జునరావు మాట్లాడారు. గంజాయి, మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం ద్వారా కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాల రవాణా, ఇతర సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలన్నారు. విద్యార్థుల కదలికలపై పాఠశాలల సిబ్బంది నిఘా ఉంచాలన్నారు. తమ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నట్ల అప్పలరాజు, పరవాడ ఎస్ఐ మహాలక్ష్మి, పీఈటీ వి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎస్.ఎన్.రెడ్డి, దర్మిరెడ్డి సత్యనారాయణ, సచివాలయ మహిళా పోలీస్ శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో రేషన్ డిపో



రేషన్ డిపో ఏర్పాటుపై ఆనందం వ్యక్తం చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ: గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం, టిడ్కో కాలనీల ప్రజల కోసం నూతన రేషన్ డిపో ఏర్పాటు చేయడం పట్ల ఐద్వా మండల శాఖ సభ్యులు, కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఐద్వా మండల సంఘం సభ్యుల పోరాట ఫలితంగా కాలనీ ప్రజలకు రేషన్ డిపో అందుబాటులోకి వచ్చిందని అనకాపల్లి జిల్లా ఐద్వా సంఘ అధ్యక్షురాలు పి.మాణిక్యం తెలిపారు. కాలనీల ప్రజలకు అందుబాటులో ఉండేలా నూతన రేషన్ డిపోను జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. రేషన్ డిపో-8 ద్వారా ప్రతీ నెల 5, 6, 7 తేదీల్లో ప్రజలకు రేషన్ సరకులు అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని కాలనీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఇప్పటి వరకు స్థానికంగా రేషన్ డిపో లేకపోవడంతో ఇరు కాలనీల ప్రజలు రెండు కిలోమీటర్ల దూరంలోని గొర్లివానిపాలేనికి వెళ్లి రేషన్ సరకులను తీసుకోవాల్సి వచ్చేది. దీనిపై గతంలో మండల రెవెన్యూ అధికారులను ఐద్వా సభ్యులు, కాలనీ ప్రజలు స్వయంగా కలిసి, విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అధికారులు స్పందించి నూతన రేషన్ డిపో ఏర్పాటు చేయడం పట్ల కాలనీల ప్రజలు, ఐద్వా ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు.

19 నుంచి శంకర్ ఫౌండేషన్‌లో క్రీడా పోటీలు

సింహాచలం: వచ్చే నెల 2న శంకర్ ఫౌండేషన్ ఫౌండర్స్ డే పురస్కరించుకుని ఈ నెల 19 నుంచి 26 వరకు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు పలు క్రీడా, సాంస్కృతిక పోటీలను నిర్వహించనున్నట్లు డీజీఎం కె.బంగార్రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 19న ఆప్టోఫేర్, 20న పాటల పోటీలు, 21న శ్లోక పారాయణం, 22న గ్లాస్ పెయింటింగ్, 23న ఇమాజినరీ స్టోరీ టెల్లింగ్, 24న రోల్ ప్లే, 25న చిత్రలేఖనం, 26న వక్తృత్వం పోటీలు ఉంటాయన్నారు. కళాశాల విద్యార్థులకు 20న పాటల పోటీలు, 22న గ్లాస్ పెయింటింగ్, 26న వక్తృత్వం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఈ నెల 18లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని సూచించారు. విజేతలకు సెప్టెంబరు 1న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. వివరాలకు 99635 82130, 91210 05933 నెంబర్లలో, foundersdaysf@gmail. com మెయిల్ ద్వారా సంప్రదించవచ్చన్నారు.

మేయర్‌కు 'స్థాయీ' సత్కారం

డాబాగార్డెన్స్: ఇటీవల ఎన్నికైన జీవీఎంసీ స్థాయీ సంఘం సభ్యులు మంగళవారం మేయర్ పీలా శ్రీనివాసరావును పెందుర్తి మేయర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరాభివృద్ధికి కృషి చేయాలని, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ చర్చ జరిగేలా చూడాలన్నారు. సభ్యులు కొణతాల నీలిమ, గంకల కవిత, దాడి వెంకట రామేశ్వరరావు, సేనాపతి వసంత, గేదెల లావణ్య, రాపర్తి త్రివేణి వరప్రసాద్, మాదంశెట్టి చినతల్లి, మొల్లి ముత్యాలు పాల్గొన్నారు.

రామ్‌ప్రసాద్ నియామకంపై హర్షం

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా బుచ్చి రామ్‌ప్రసాద్ నియామకం పట్ల టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి, విశాఖ పార్లమెంట్ కన్వీనర్ వంగూరి గణేష్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సీఎం ఆమోదంతో విడుదలైన నామినేటెడ్ పదవుల ప్రకటనలో బ్రాహ్మణ కార్పొరేషన్ కూడా ఉండడం హర్షణీయం అన్నారు. బ్రాహ్మణుల శ్రేయస్సు కోసం పని చేస్తున్న రామ్ ప్రసాద్ కృషికి తగిన గుర్తింపు లభించిందన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ



వాడచీపురుపల్లి స్కూల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కనకఅప్పారావు



గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందిస్తున్న ఎంపీడీవో శివప్రసాద్



పరవాడ బాలికల హైస్కూల్లో.. వైద్య బృందం



ధర్మారాయుడుపేట జెడ్పీ స్కూల్లో వియ్యపు చిన్న

పరవాడ: మండలంలోని పరవాడ, వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. వాడచీపురుపల్లి పీహెచ్‌సీ పరిధిలో 4,186 విద్యార్థులకుగాను 4,102 మందికి, పరవాడ పీహెచ్‌సీ పరిధిలో 6,711 మందిలో 6,650 మందికి మాత్రలు వేశారు.

- వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కనకప్పారావు స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు, పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి జయశ్రీ అక్కడి జెడ్పీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు స్వయంగా నులిపురుగు నివారణ మందులు వేశారు.
- రావాడ శివారు ధర్మారాయుడుపేట జెడ్పీ స్కూల్లో మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులకు మాత్రలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పద

సబ్బవరం మండలంలో..

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో శివప్రసాద్ సత్యనారాయణ చేతుల మీదుగా మాత్రలు అందించారు. ఈ సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రల ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. సబ్బవరం సీహెచ్‌వో స్వర్ణలత మాట్లాడుతూ స్థానిక పీహెచ్‌సీ పరిధిలో 9,962 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయాల్సి ఉండగా, 9,363(94 శాతం) మందికి అందించామన్నారు. 2 నుంచి 19 ఏళ్ల లోపు వయసున్న వారంతా మాత్రలు వేసుకోవాలన్నారు. మిగిలిన వారికి ఈ నెల 20న మరోసారి మాత్రలు వేయనున్నట్లు పేర్కొన్నారు. సుమారు 160 మంది వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు ఈ విధుల్లో పాల్గొన్నారని తెలిపారు. గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆశ, ప్రిన్సిపాల్ రామకృష్ణ, గురుకుల పాఠశాల మెడికల్ రిప్రజెంటేటివ్ కన్నంనాయుడు, ఏఎన్ఎం విజయకుమారి పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో సృజనకు పదును



ప్రయోగాల కిట్‌లతో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, డీఈసీఈ విద్యార్థులు

పెందుర్తి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృనాత్మకతకు, వృత్తి నైపుణ్యాలకు మరింత పదును పెట్టేందుకు తగిన సౌకర్యాలు కల్పిస్తున్నామని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. ఎం/ఎస్ మైయాక్సెస్ ప్రై.లి. సంస్థ పాలిటెక్నిక్ కళాశాలతో వివిధ పరిశ్రమలను అనుసంధానించేలా ఎంబెడెడ్ సిస్టమ్స్ లేబొరేటరీ కిట్‌లను మంగళవారం ఏర్పాటు చేసింది. డీఈసీఈ సెమిస్టర్-5కు చెందిన 12 ప్రయోగాలను ఈ ఒక్క కిట్ సాయంతో చేయొచ్చు. తద్వారా అప్లైడ్ ఎలక్ట్రానిక్స్‌లో విద్యార్థులకు బలమైన పునాది ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు కూడా ఈ కిట్ల సాయంతో సైద్ధాంతిక జ్ఞానం, ఆచరణాత్మక ప్రయోగాల ద్వారా వాస్తవ ప్రపంచ నైపుణ్యాలపై అవగాహన పెంచుకుంటారని తెలిపారు. లైట్లు, మోటార్లను నియంత్రించడం నుంచి మెజర్‌మెంట్, ఆటోమేషన్ కోసం సెన్సార్లను ఉపయోగించడం వరకు ఆధునిక పరికరాలు ఎలా నియంత్రించగలుగుతున్నాయో తెలుసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మై యాక్సెస్ ప్రై.లి. ప్రతినిధి టి.సూర్యస్వరూప్, కళాశాల ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.నాగమణి పాల్గొన్నారు.

అమ్మోనియా పరిశ్రమపై చర్యలకు డిమాండ్



తరచూ గ్యాస్ లీకేజీలకు కారణమవుతున్న భార్గవి అమ్మోనియా పరిశ్రమ

పరవాడ: ఈ.బోనంగి ఇండస్ట్రియల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన భార్గవి అమ్మోనియా పరిశ్రమ నుంచి తరచూ గ్యాస్ లీకేజీలతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. పరిశ్రమ యాజమాన్యం రాత్రి సమయంలో విడుదల చేస్తున్న గ్యాస్‌ను ప్రజలు పీల్చడం వలన శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. ఈ లీకేజీలపై పీసీబీ, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయనతోపాటు మండల వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, చందక కృష్ణ, ఇరోతి రమేష్, బొద్దపు శ్రీనివాసరావులు డిమాండ్ చేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చైతన్యకు బాండ్ అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి స్థానిక నివాసి జీబీఏకే చైతన్య రూ.లక్షా 81 విరాళాన్ని నగదు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు బాండ్‌ను అన్నప్రసాద విభాగం ఏఈవో రమణమూర్తి అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు. అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ నరసింగరావు పాల్గొన్నారు.